"నిస్సందేహంగా ఆ దేవుడి కన్నా మీరే గొప్పవారు." తడుముకోకుండా ఆ పండితుడు జవాబు చెప్పాడు.

"ఎందుకని?" దర్పంగా చూస్తూ అడిగాడు రాజు.

"ఎందుకంటే మీ ఆజ్ఞకు బద్ధులు కానివారిని మీరు మీ దేశం నించి బహిష్కరించగలరు. కాన భగవంతుడు తన సృష్టిలో తనకి బద్ధుడు కాని ఏ జీవినీ తన దేశంనించి బహిష్కరించలేడు. ఎందుకంటే ఈ పృథ్వి మీద ఆయనకి చెందని ప్రదేశం అంటూ లేనేలేదు కదా."

ఆ జవాబుకి ముందు రాజుకి కోపం వచ్చినా, ఆలోచించాక తన తప్పిదానికి కారణం అయిన తనలోని అహంకారమే అని రాజుకి అర్థం అయింది. దాంతో క్రమేపి రాజులోని అహం నశించింది.

## 75. కాలం-న్యాయం

ఓసారి మాతా అమృతానందమయి ఆశ్రమవాసులలో ఒకరికి ఇంకొకరితో పోట్లాట వచ్చింది. ఆ రెండో అతను తప్పు చేసాడు. దాంతో మొదటివాడు మాత దగ్గరకి వెళ్ళి రెండవ అతని మీద ఫిర్యాదు చేసాడు. విచారణలో నిజం తేలాక అమ్మ అతన్ని ఆశ్రమం నించి తప్పక పంపేస్తుందని మొదటివాడు భావించాడు కాని అలా జరగక పోగా, అమ్మ రెండోవాడితో మృదువుగా వ్యవహరించడం చూసి మొదటివాడు దిగ్భ్రాంతి చెందాడు.

దాంతో మొదటివాడు అమ్మని అడిగాడు.

"వాడిని శిక్షించి న్యాయం చెయ్యలేదేమమ్మా?"

అప్పుడు మాతా అమృతానందమయి చిన్నగా నవ్వి ఇలా జవాబిచ్చింది.

"గురువు ఆస్థానంలో న్యాయం జరగదు. ఇక్కడ కేవలం దయా దాక్షిణ్యాలే లభిస్తాయి. కాలం అనే న్యాయస్థానంలో మాత్రమే సరైన సమయంలో కర్మ ఫలించాక ఎవరికైనా న్యాయం తప్పక లభిస్తుంది."